అణువణువు జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 22 జూన్ 2023

క్రాంతికి దక్కిన ఉత్తమ పురస్కారం

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో నిర్వహించిన తెలంగాణ విద్యా దినోత్సవ సందర్భంగా పీడీ గంట క్రాంతికి ఉత్తమ ఉపాధ్యాయ సత్కారం దక్కింది. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ వేసవికాల ప్రత్యేక శిబిరంలో తన శ్రమను గుర్తించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా సత్కారం పొందడం ఆనందంగా ఉందన్నారు.



వాన..వాన..రావమ్మా..!

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మృగశిర కార్తె ఆరంభమై పక్షం రోజులు గడుస్తున్నా వరుణుడి జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు నమ్మకంతో దేవాలయాలకు జలాభిషేకం చేస్తున్నారు. బుధవారం మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన యువకులు దనోర-బి, ఇన్‌కర్‌గూడ, దేవాపూర్, శంకర్‌గూడ తదితర గ్రామాలతో పాటు 11 హనుమంతుడి విగ్రహాలకు కలశం ద్వారా తెచ్చిన నీటితో జలాభిషేకం చేశారు. హనుమంతుని నామస్మరణతో వర్షం కురువాలని మండుటెండలో కాలినడకన వివిధ గ్రామాల దేవతలకు జలాభిషేకం చేశారు. తమ పూర్వీకులు అప్పట్లో వర్షాలు కురువకపోతే ఇలా హనుమంతుడి దేవాలయాలకు వెళ్లి జలాభిషేకం చేస్తే వర్షాలు పడేవని యువకులు తెలిపారు. ఇలా తమ పెద్దల ఆచారం, సాంప్రదాయాలను పాటిస్తున్నామని పేర్కొన్నారు. వాన దేవుడు కరుణించి తమ విత్తనాలను కాపాడాలని ప్రార్థించారు.

సమయం ముగిసే..సాయం మిగిలే..!

- రూ.లక్ష రుణ సాయం కోసం వెల్లువెత్తిన దరఖాస్తులు
- ఈ నెల 26 వరకు క్షేత్ర స్థాయిలో పరిశీలన
- అనర్హుల గుర్తింపు తర్వాతే లబ్ధిదారుల ఎంపిక
- సకాలంలో ధ్రువపత్రాలు లభించక అనేక మంది దూరం

బీసీ కుల చేతి వృత్తిదారులకు ప్రభుత్వం అందించే రూ.లక్ష రుణ సాయం కోసం దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. ఈ నెల 20వ తేదీ వరకే గడువు ఉండటంతో ఈ కులాలకు చెందిన అనేక మంది దరఖాస్తులు చేశారు. గడువు తక్కువగా ఉండటం.. లబ్ధిదారుల సంఖ్య భారీగా ఉండటంతో మీసేవా, తహసీల్దార్ కార్యాలయాలు వారం రోజుల పాటు కిటకిటలాడాయి. వచ్చిన దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయనున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇది వరకు రూ.50వేల రుణం తీసుకున్న వారితో పాటు కుల వృత్తి చేయనివారు, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని అనర్హులుగా ప్రకటించనున్నారు. కుల వృత్తులు చేస్తున్న వారితో పాటు బీసీ కులాలకు చెందిన అనేక మంది ఈ రుణం కోసం దరఖాస్తు చేసినట్లు తెలిసింది. ఇలాంటి దరఖాస్తులను తిరస్కరించనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. మరోపక్క గడువు తక్కువగా ఉండటంతో ఆయా ధ్రువపత్రాలు లభించక అనేక మంది దరఖాస్తులు చేసుకోలేకపోయారు. దీంతో ప్రభుత్వ సాయానికి దూరమవుతున్నామనే అసంతృప్తి వారిలో వ్యక్తమవుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం బీసీ కులాల్లోని చేతివృత్తిదారులకు రూ.లక్ష రుణ సాయం అందించాలని నిర్ణయించింది. ఇందుకు ఆయా కులాలకు చెందిన చేతివృత్తిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దీంతో బీసీ జాబితాలోని 15కులాలకు చెందిన వారు దరఖాస్తులు చేశారు. ఈ నెల 9వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గడువు ఉండటం..ఈ పది రోజుల వ్యవధిలో దరఖాస్తులు చేసేందుకు లబ్ధిదారులు ఆపసోపాలు పడాల్సి వచ్చింది. రుణం కోసం కుల, ఆదాయ ధ్రువపత్రం తప్పనిసరి సమర్పించాల్సి రావడంతో వాటి కోసం పడరాని పాట్లు పడ్డారు. రోజుల తరబడి మీసేవా, తహసీల్దార్ కార్యాలయాల వెంట ప్రదక్షిణలు చేశారు. స్థానికంగా రెవెన్యూ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆయా ధ్రువపత్రాలు సకాలంలో లభించని పరిస్థితి తలెత్తింది. ఓ దశలో త్వరగా అందజేసేందుకు రెవెన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు వచ్చాయి. అష్టకష్టాలు పడి ధ్రువపత్రాలు సంపాదించి రుణం కోసం దరఖాస్తు చేయాల్సి వచ్చింది. ఆదిలాబాద్ జిల్లాలో చివరి రోజు నాటికి 11,721 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ ఇదే విధంగా దరఖాస్తులు వెల్లువెత్తినట్లు తెలుస్తోంది.

ఈ నెల 26వ తేదీ వరకు పరిశీలన

మీసేవా ద్వారా వచ్చిన దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ వరకు పరిశీలన చేపట్టనున్నారు. ఇప్పటికే ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ లాగిన్‌లో దరఖాస్తులు ఉండటంతో వాటి నుంచి తీసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టనున్నారు. ఇందులో ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తులు చేసిన వారినే పరిగణనలోకి తీసుకోనున్నారు. ఆయా కులాలకు చెంది ప్రస్తుతం చేతివృత్తులు చేస్తున్న వారే అర్హులని అధికారులు చెబుతున్నారు. వృత్తి పనిచేయకుండా దరఖాస్తులు చేసిన వారిని తిరస్కరించే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. ఒక ఊరి నుంచి మరో ఊరికి వెళ్లిన వారు, ఇప్పటికే రూ.50వేలు రుణం తీసుకున్న వారిని అనర్హులుగా ప్రకటించే అవకాశం ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలన ముగిసిన తర్వాత జిల్లా స్థాయి కమిటీ అర్హులను ఎంపిక చేస్తుందని తదనంతరం మంత్రి వాటిని ఆమోదించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోపక్క ప్రస్తుతం జిల్లాకు ఎన్ని యూనిట్లు అందిస్తారనే విషయమై స్పష్టత లేకుండా ఉంది. దరఖాస్తుదారుల్లో అర్హులైన అందరికీ రుణం అందిస్తారా..లేదంటే పరిమితంగా ఇస్తారా అనేది తెలియడం లేదు. దరఖాస్తు గడువు పెంచాలని సర్వత్రా డిమాండ్లు వినిపించినా ప్రభుత్వం వాటిని ఖాతరు చేయలేదు. దీంతో అనేక మంది లబ్దిదారులు దరఖాస్తులకు దూరమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పరిశీలన తర్వాతే లబ్ధిదారుల ఎంపిక : రాజలింగు, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి, ఆదిలాబాద్

బీసీ కులాల్లోని చేతివృత్తిదారులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష రుణం సాయం కోసం జిల్లాలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అర్హులను ఎంపిక చేసేందుకు ఈ నెల 26వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడుతాం. ఆ తర్వాత జిల్లా స్థాయి అధికారుల కమిటీ అర్హులను ఎంపిక చేస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది.

మూగ జీవాల మృత్యు ఘోష..!



- రెండు వైద్యశాలలకు ఒకే డాక్టర్ల
- తప్పని మందుల కొరత
- లంపీస్కిన్, సర్ర వ్యాధులతో మృత్యువాత
- తగ్గుతున్న పశువుల సంఖ్య



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రతిఏటా వర్షాకాలం రాగానే మూగ జీవాలు వైరస్, బ్యాక్టీరియల్ వ్యాధులతో మృత్యువాత పడుతున్నాయి. సరైన సమయంలో పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండక, మందులు లేక పశువులు మూగ రోదన అనుభవిస్తున్నాయి. పశు వైద్య సిబ్బంది మందులు లేక ప్రయివేట్‌కు రెఫర్ చేస్తున్నారు. గత్యంతరం లేక పశువుల యజమానులు ప్రయివేట్‌లో మందులను కొనుక్కుంటున్నారు. మెడికల్ షాప్ నిర్వాహకులు అధిక ధరలకు మందులను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. మండలంలో మొత్తం 28 గ్రామపంచాయతీలకు గాను ఇంద్రవెల్లి, ముత్నూర్ గ్రామాల్లో రెండు పశువైద్యశాలలు పని చేస్తున్నాయి. ఆ శాఖ పశు గణన ప్రకారం మూత్నూర్ సెంటర్ పరిధిలో ఆవులు, ఎద్దులు 9,273, గేదెలు 2,042, గొర్రెలు 1043, మేకలు 4,938 ఉన్నాయి. ఇంద్రవెల్లి వైద్యశాల పరిధిలో ఆవులు, ఎద్దులు 18,553, గేదెలు 1553, గొర్రెలు 1543, మేకలు 10,226 ఉన్నాయి. ఇదంతా బాగానే ఉన్నా ప్రతి ఏటా పశువులకు సర్ర, గాలికుంటు, ప్లాస్టిక్ వంటి వ్యర్థ పదార్థాలు తినడం వల్ల కడుపు ఉబ్బడం, జొన్న లేప తినడం వల్ల మృత్యువాత పడుతున్నాయి. దీంతో పాటు నట్టల వ్యాధి, ఈ ఏడు కొత్తగా లంపీస్కిన్ వ్యాధి సోకడం వల్ల అనేక పశువులు మృత్యువాత పడుతున్నాయి. వ్యాధులు సోకినప్పుడు వైద్య సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉండకపోవడంలో రైతులు గ్రామీణ ప్రాంతాల్లో నాటు వైద్యులను ఆశ్రయించి పశువుల ప్రాణాలను కాపాడుకుంటున్న దాఖలాలు అనేకం ఉన్నాయి.

రెండు వైద్యశాలకు ఒకే వైద్యుడు

మండలంలో రెండు పశువైద్యశాలలకు ఒకే ఒక వైద్యుడు కొనసాగుతున్నాడు. ఇంద్రవెల్లి కేంద్రంలోని వైద్యుడు ఆరు నెలల కింద బదిలీ కాగా, ఆయన స్థానంలో కొత్త వైద్యున్ని భర్తీ చేయలేదు. దీంతో ఉన్న అటెండర్లే చికిత్స అందిస్తున్నారు. ఉన్న ఒకే ఒక వైద్యుడు ఎన్నడూ అందుబాటులో ఉండటం లేదని రైతులు పేర్కొంటున్నారు. పశువులకు వ్యాధి సోకినప్పుడు చిన్న చిన్న వాటికే మాత్రమే చికిత్స చేస్తున్నారు తప్ప వైరల్ వంటి వ్యాధులకు అవసరమయ్యే ఇంజెక్షన్ల కోసం ప్రైవేట్‌కు చీటీలు రాసి ఇస్తున్నారని పశు యజమానులు పేర్కొంటున్నారు. మెడికల్ షాపు నిర్వాహకులు అధిక ధరలకు మందులను అమ్మి రైతులకు నట్టేట ముంచుతున్నారు. ఇంత ఖరీదైన మందులను కొనుగోలు చేసి చికిత్సలు అందించినా పశువులు చివరకు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పశు పోషకులు ఆర్థికంగా నష్టపోవడమే గాక ఒకప్పుడు పది మందికి పాలు, పెరుగు పంచిన రైతన్న కరీంనగర్ డెయిరీ నుంచి వచ్చే పాల ప్యాకెట్లపై ఆధాపడుతున్నారు. పల్లె రైతు తమ కుటుంబాల అవసరం కోసం పాల ప్యాకెట్లను కొనుగోలు చేయడం గమనార్హం. పశువులను రక్షించుకోకపోతే రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతంలో పశువుల సంఖ్య క్రమ క్రమంగా తగ్గిపోయే అవకాశం లేకపోలేదు. ఇది సేంద్రీయ వ్యవసాయ సాగుపై తీవ్ర ప్రభావం చూపనుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో పంటలకు రసాయనిక ఎరువులను వాడటం వల్ల మనుషులకు అనేక కొత్త రోగాలు చుట్టుముట్టే అవకాశం మెండుగా కనిపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు పశు వైద్యశాలలపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

సకాలంలో వైద్యమందక పశువులు మృతి చెందాయి : చరక్ ఉద్ధవ్, పశు పోషకుడు, శంకర్‌గూడ

నా దగ్గర ఇరవై వరకు పశువులు ఉన్నాయి. ఇటీవల సర్ర వ్యాధి సోకినప్పుడు పశువైద్యశాల కెళితే మందులు మెడికల్ షాపుకు రాసిచ్చారు. వెయ్యి రూపాయలు ఖర్చు చేసి మందులు తెచ్చి చికిత్స అందించాను. అయినా రెండు పశువులు మృత్యువాత పడ్డాయి. పశువైద్యశాలలో మందులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలి. రాబోయే వర్షాకాలంలో వైద్యుడిని అందుబాటులో ఉంచాలి.

రైతుల ఖాతాల్లో వరి ధాన్యం డబ్బులు జమ

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నెలలు గడుస్తున్నా వరి ధాన్యం డబ్బులు జమవ్వక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి బుధవారం నవతెలంగాణ కథనాన్ని ప్రచురించింది. ప్రత్యేక కథనంతో రైతుల ఖాతాల్లో వరి ధాన్యం డబ్బులు జమ అయినట్లు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు నవతెలంగాణకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అన్ని కులమతాలు సమానమే : కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ-తాంసి


తెలంగాణ రాష్ట్రంలో అన్ని కుల మతాలు సమానమేనని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బోడగుట్ట సమీపాన ఉన్న బుద్ధ విహార్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. బౌద్ధ మత గురువు బంతిజీ కలెక్టర్‌ను శాలువా పూలబొకే ఇచ్చి ఆహ్వానించారు. అనంతరం గౌతమ బుద్ధుని విగ్రహానికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మత గురువు కలెక్టర్‌తో పాటు వచ్చిన ప్రజాప్రతినిధులతో ఐదు నిమిషాల పాటు ఆధ్యాత్మిక ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకుని పదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో ఈ దశాబ్ది ఉత్సవాలను 20 రోజులపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు మసీదులు, మందిరాలు, చర్చిల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ కుల మతాలకనుగుణంగా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, తలమడుగు జడ్పీటీసి గణేష్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో భూమయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శంకర్, నాయకులు దుర్గం శేఖర్, మహేందర్, వెంకన్న, అధికారులు నారాయణరెడ్డి, సురేందర్, నర్సింగ్, బౌద్ధ మతస్తులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : అభివృద్ధిలో ఆదిలాబాద్ జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవంలో భాగంగా పట్టణంలోని మార్వాడి ధర్మశాల, ఖుర్షాపూర్ మసీదులో వేరువేరు కార్యక్రమాలలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా మార్వాడి ధర్మశాలలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యేకు వేద పండితులు, ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఆలయంలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధితో పాటు ప్రజల ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో విరిసిల్లాలని దేవుళ్లని కోరుకున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని, జిల్లా ప్రగతికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కులమతలకాతీతంగా దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర మందిరాల నిర్మాణాలకు, ఆధునీకరణకు ప్రభుత్వం అనేక నిధులు వెచ్చిస్తున్నదని తెలిపారు. దీపదూప నైవేద్యం కింద ప్రభుత్వం అర్చకులకు రూ.10వేల వేతనాన్ని అందిస్తుందన్నారు.

బోథ్ : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని విట్టలేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక దినోత్సవానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా 9ఆలయాలకు ధూప దీప నైవేద్యం ద్వారా మంజూరైన ప్రొసీడింగ్‌లను పూజరులకు అందజేశారు. అదేవిధంగా సోనాల గ్రామానికి చెందిన రాడపక శంకర్‌కు రూ.14000 సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎఎంసి చైర్మన్ రుక్మన్‌సింగ్, వైస్ ఎంపిపి లింబాజి, వైస్ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, ఎలుక రాజు, సర్పంచ్ సురేందర్, సుభాష్, జగన్‌రెడ్డి, రాయలు, రమణగౌడ్, విడిసి గంగాధర్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలో ప్రసిద్ధి గాంచిన అడెల్లి మహా పోచమ్మ ఆలయం వద్ద ఆధ్యాత్మ క దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుల్లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా పోచమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాలకు పెద్దపీట వేసిందన్నారు. సీఎం కేసిఆర్ సారథ్యంలో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ అభివృద్ధికికి కృషి చేసిన ఆలయ చైర్మన్ అయిటి చందుకు ఉత్తమ అవార్డు తోపాటు ప్రశంస పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ నారాయణరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, ఎఎంసి చైర్మన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవ్‌రావు, గ్రామ సర్పంచ్ సుచరిత రాజేశ్వర్‌రావు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నవీన్‌కుమార్, ఇన్‌చార్జి ఈఓ రంగు రవికిషన్‌గౌడ్, ఆలయ ధర్మ కర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాసర : సరస్వతి దేవి క్షేత్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆధ్యాత్మిక ఉత్సవాలలో పాల్గొని అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు యాగ మండపంలో ప్రత్యేక హోమం నిర్వహించి రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరారు. అనంతరం ఆధ్యాత్మిక ఉత్సవాలలో భాగంగా అమ్మవారి భక్తులకు, దాతలకు ఆలయం తరపున ఎమ్మెల్యే ప్రశంసా పత్రాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విజయరామారావు, సర్పంచ్ లక్ష్మణరావు, పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, బిఆర్ఎస్ నాయకులు సుకం రామారావు, రమేష్, విశ్వనాథ్ పటేల్, దేవేందర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అదిలాబాద్ రూరల్ : మావల మండలంలోని భట్టిసావర్గం గ్రామంలోని హనుమాన్ మందిరంలో ఆధ్యాత్మిక దినోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్ మాట్లాడుతూ కెసిఆర్‌కు, ఎమ్మెల్యే జోగు రామన్నకు మళ్లీ పట్టం కట్టాలని ప్రత్యేక పూజలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాగం గోవర్ధన్, అర్చకులు శంకరయ్య, రాజారెడ్డి, పంచాయతీ సెక్రటరీ హేమలత, గంగారెడ్డి, రవి, భూమన్న పాల్గొన్నారు.





'భారతదేశం ప్రపంచానికి యోగా నేర్పింది'



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలో బీజేపీ నాయకులు యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు గోవర్ధన్ మాట్లాడుతూ ప్రపంచానికి యోగా నేర్పింది భారతదేశమే అన్నారు. యోగా సాధనతో ఎన్నో రకాల రోగాలు నయమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రంజిత్, సర్పంచులు ముత్యంరెడ్డి, రవి, రామ్‌రాజు, రాపని గంగాధర్, హరిష్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకున్నారు. వివిధ వృత్తుల్లో బిజీగా ఉండే ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరు యోగాను నిరంతరంగా చేయాలన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం కెసీబీ గార్డెన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షులు సునీల్ చౌహాన్ మాట్లాడుతూ..యోగా వల్ల మానవుని శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసం జరుగుతుందన్నారు. వేల సంవత్సరాలు చరిత్ర కలిగిన యోగా శాస్త్రం ప్రపంచానికి భారతీయులు అందించిన అద్భుతమైన కానుక అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు డోంగ్రే విజయ్ కుమార్ పాల్గొని యోగా శిక్షణ కార్యక్రమాలు, యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వలబోజు గోపికృష్ణ, సంఘ నాయకులు నారాయణ, మనోజ్‌రెడ్డి, గోపాలకృష్ణ, గోమంత్‌రెడ్డి, రాజ్‌కుమార్, అనిల్, నరేష్, గోపాల్, కేశవ్, శ్రీనివాస్, అశ్విన్ పాల్గొన్నారు.

బిజెపి ఆధ్వర్యంలో..

ప్రపంచ యోగా దినోత్సవాన్ని బీజేపీ ఆధ్వర్యంలో ప్రగతి పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ ఎటువంటి మందుల అవసరం లేకుండా కేవలం యోగా ద్వారానే రోగాలను నయం చేసుకోవచ్చని తెలిపారు. ప్రపంచ దేశాలు ఆదరిస్తున్న యోగాను మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా ప్రతిరోజు యోగా కోసం సమయాన్ని కేటాయించి విద్యార్థులను ఆరోగ్యవంతులను చేసేందుకు యోగా సాధన నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు ఆదినాథ్, లాలా మున్నా, జోగు రవి, ఆకుల ప్రవీణ్, విజయ్, సాకటి దశరథ్, రత్నాకర్‌రెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి, ధోని జ్యోతి, భీంసేన్‌రెడ్డి, నగేష్‌రెడ్డి, వేద వ్యాస్, రవి, సురేష్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.భరద్వాజ యోగా ధ్యానం చేయడం వలన కలిగే మానసిక, శారీరక లాభాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్‌కుమార్, సురేష్, రామేశ్వర్‌రెడ్డి, సుధాకర్, నీల్‌కమల్, మురళీకృష్ణ, కుమారస్వామి, రవికుమార్, సుధాకర్, రాజేష్, కిషోర్, ఎజాజ్, శ్రీనివాస్, జ్యోత్స్నరాణి, హేమలత పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో..

నిత్య జీవితంలో ప్రజలు ఒత్తిళ్ల బారిన పడుతూ ఉంటారని, ఒత్తిళ్లను తగ్గించేందుకు ప్రతి రోజు యోగా కోసం సమయాన్ని కేటాయించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి విఆర్ఆర్ వరప్రసాద్ సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని న్యాయస్థాన ప్రాంగణ ఆవరణలో యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యాసకుల సూచనల మేరకు యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, ఎస్‌సిజె మంజుల సూర్యవార్, జెసిజె దుర్గారాణి, పిసిఆర్ జడ్జి, బార్ అధ్యక్షురాలు ప్రమీలా జైన్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలలో..

యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యకర జీవనం గడపవచ్చని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని సంరక్షణ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికులు, విద్యార్థులతో కలిసి యోగా గురువుల సమక్షంలో యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు మెట్టు ప్రహ్లాద్, ధమ్మపాల్, గంగారెడ్డి, రాంకుమార్ పాల్గొన్నారు.

ఖానాపూర్ రూరల్ : పట్టణంలోని ఉద్యానవనం పార్కులో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పెంబి జడ్పీటీసి జానుబాయి యోగా సాధన చేసి యోగా దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మానవ జీవితంలో యోగా ఆవశ్యకతను, ప్రాధాన్యతను వివరించారు. యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆయుష్షు పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రావణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, నాయకులు బుచ్చన్న, గోపాల్‌రెడ్డి, రాజేశ్వర్, సాయికృష్ణ, సాయి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు ఎంపీ భూమి పూజ

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంతో పాటు కౌట-బిలో రూ.3లక్షల నిధులతో సీసీ రోడ్డు, పొచ్చెర గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపి మాట్లాడుతూ బోథ్ ఎస్సీ కాలనీలోని నూతన కమ్యూనిటీ భవనాన్ని రూ.5లక్షలతో నిర్మిస్తామన్నారు. ఎస్సీ కాలనీ రెండు లక్షల నిధులతో బోరు మోటారు, కౌట-బిలో మూడు లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఓబిసి జిల్లా అధ్యక్షుడు గొల్ల రాజు యాదవ్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జీవీ రమణ, నాయకులు గోపాల్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ బలోపేతానికి కృషి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో వైఎస్సార్ తెలంగాణ పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతానికి పార్టీ నాయకులు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జైనథ్ మండలానికి చెందిన నాయకులు వైయస్సార్‌టిపిలో చేరారు. ఈ సందర్భంగా జైనథ్ మండల అధ్యక్షుడిగా గేడం నితిన్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైయస్సార్ పాలన మళ్లీ రావడం కోసం తమ పార్టీ జిల్లాలో పోటీ చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పెందూర్ మనోహర్, ఎస్టి సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెస్రం శంకర్, పట్టణ అధ్యక్షులు షేక్ అస్లం, కృష్ణంరాజు, ఈశ్వర్‌దాస్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని తరోడ గ్రామ సమీపన బుధవారం గుర్తుతెలియని యువకుడు(31) మృతదేహం లభ్యమైందని ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం..తరోడ గ్రామ శివారులో గుర్తు తెలియని శవం కనిపించటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతిడికి సంబంధించిన వివరాలు లభ్యం కాలేదు. మృతదేహన్ని భైంసా ఆసుపత్రిలో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు

రీడింగ్ రూమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ముధోల్

నిరుద్యోగ యువతీ యువకులు రీడింగ్ రూమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రీడింగ్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రీడింగ్ రూమ్‌లో దినపత్రికలు, వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావటానికి ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం గన్నోర గ్రామంలో 20లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సురేష్‌బాబు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, మండల రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు రాజేందర్, లావణ్య కిష్టయ్య, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సంజీవ్, తిరుపతిరెడ్డి, రవికిరణ్‌గౌడ్, రమేష్, మైశాజీ పాల్గొన్నారు..

సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగుల బైక్ ర్యాలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయం దివ్యాంగులకు అనుకూలంగా నిర్మించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ర్యాంప్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ నుండి ప్రారంభమైన ర్యాలీ మున్సిపల్ కార్యాలయం వరకు సాగింది. వికలాంగుల కోసం పట్టణంలో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేసే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఎంపీ సోయం పీఏపై అట్రాసిటీ కేసు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ ఎంపీ సోయం బాపురావు పర్సనల్ అసిస్టెంట్ (పిఏ) నగేష్‌పై మావల పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఎస్ఐ విష్ణువర్ధన్ వివరాల మేరకు.. బట్టిసావర్గం గ్రామ శివారులోని ఓ భూమి విషయంలో నగేష్ తనను కులం పేరుతో దూషించడంతో పాటు దాడికి యత్నించారని బాధితుడు రాజు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నగేష్‌తో పాటు నలుగురిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇటీవల ఎంపీ ల్యాడ్స్ నిధులను ఇంటి నిర్మాణానికి, కొడుకు పెండ్లికి వాడుకున్నానని ఎంపీ సోయం చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపగా, తాజాగా ఎంపీ పీఏపై భూవివాదంలో అట్రాసిటీ కేసు నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది.

రైతుకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ



నవతెలంగాణ-జైనథ్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతుకు రెండు లక్షల రూపాయలు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇంటింటికి తిరుగుతూ యువతి, యువకులను కలుస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే హామీలను వివరించారు. రైతులకు ఎకరాకు రూ.15వేల రైతుబంధు, ఆడబిడ్డకు రూ.500 వంట గ్యాస్ సిలిండర్‌కు ఇస్తామన్నారు. బిఆర్ఎస్, బిజెపి నాయకులపై ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే గ్రామ ప్రజలకు ఇప్పటివరకు చేసిందేమీ లేదన్నారు. 100 ఎకరాలున్న భూస్వాములకు రైతుబంధు అమలు చేస్తూ రాష్ట్రాన్ని దివాళా తీశారని విమర్శించారు. ఎమ్మెల్యే, బిజెపి నాయకులు తోడు దొంగలని, వారి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని తెలిపారు. తనపై ఎన్ని కేసులు బనాయించినా వెనుదిరగకుండా ప్రజా సంక్షేమం కోసం ఉద్యమిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కోడిచెర్ల సుదర్శన్, మండల ఓబిసి సెల్ అధ్యక్షుడు పిడుగు స్వామి, నాయకులు అల్లూరి అశోక్‌రెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గ కేంద్రంలో ఫైర్‌స్టేషన్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బీడి కార్మికుల సంఘ భవనంలో బుధవారం సిపిఐ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. ఆదానీ, అంబానీ లాంటి పెట్టుబడిదారులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్, పిఎఫ్ కలిగి ఉన్న ప్రతి ఒక్క బీడీ కార్మికులకు పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గోదావరి, గోవర్ధన్, దాస్, షకీర్, కజిమొద్దిన్, భోజన్న, సుమేర్ పాషా, బీడీ కార్మికులకు పాల్గొన్నారు.

సవారి బంగ్లా షెడ్‌కు భూమిపూజ

నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్

మండలంలోని పొచ్చర గ్రామంలో సవారీ బంగ్లా షెడ్‌కు బుధవారం భూమిపూజ చేశామని ఉపసర్పంచ్ భీమనవేని రమేష్ తెలిపారు. సవారీ బంగ్లా మంజూరు చేసిన ఎమ్మెల్యే జోగు రామన్నకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ గంగాధర్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన

మహనీయుడు జయశంకర్

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్‌లో...

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జయశంకర్ సార్ అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మంత్రి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జయశంకర్ తెలంగాణే ఊపిరిగా శ్వాస ఉన్నంత వరకు తెలంగాణ కోసం ఉద్యమించారని సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో కేసీఆర్‌కు వెన్నంటి ఉండి రాష్ట్ర సాధనలో భాగస్వాములయ్యారని కొనియాడారు. నీళ్ల నిధులు నియామకాల సార్ కల అని, సీఎం కేసీఆర్ ఆ కలను నిజం చేసి చూపించారని ప్రశంసించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా తెలంగాణా ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి కార్యక్రమాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌక్‌లోని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలి, మలి దశ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు సామన్‌పెల్లి నరసింహులు, ప్రధాన కార్యదర్శి మీసాల స్వామి, కోశాధికారి కొత్తపల్లి దశరథ్, వెవా రాష్ట్ర అధ్యక్షులు పడకంటి అజయ్, పట్టణ అధ్యక్షులు హనుమాండ్లు, ప్రధాన కార్యదర్శి అంగాజీ వెంకటస్వామి, కోశాధికారి ఉదారి శ్రీనివాస్, సీనియర్ నాయకులు కట్ట స్వామి, నర్సింహులు, మహేష్(ఏంవిఐ), నూనె పవన్‌కుమార్, బీడీ చారి, ఆనంద్‌రావు, జిల్లా యూత్ అధ్యక్షులు పడకంటి సూర్యకాంత్, సంజీవ్, ప్రధాన కార్యదర్శి ప్రమోద్, రమణాచారి, ప్రవీణ్, భాస్కర్ పాల్గొన్నారు.

ఖానాపూర్‌రూరల్ : ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే రేఖానాయక్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఆశయాలను నెమరు వేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాకారంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్రను ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. జయశంకర్ బాటలో తెలంగాణ ప్రజలు ముందుకు పోవాలని, ఆయన ఆశయ సాధనపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దస్తురాబాద్ : ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తహసీల్దార్ లక్ష్మీ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, జూనియర్ అసిస్టెంట్, సర్వేయర్ ఆర్ఐలు లక్ష్మీ నరసయ్య, గంగన్న పాల్గొన్నారు.



దస్తురాబాద్‌లో...



ఆదిలాబాద్‌టౌన్‌లో...

ఆర్టీసీ స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ పరిపాలన అధికారి అరవింద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బేలలో ఆర్టీసీ బస్టాండ్‌కు అనుసంధానంగా ఉన్న లేఅవుట్‌లోని 20 ఫీట్ల రోడ్డును ప్లాట్లు చేసి అక్రమంగా విక్రయిస్తున్నారని తెలిపారు. రివైజ్డ్ కొత్త లేఅవుట్ సృష్టించి అమ్మకాలు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని, ఇందులో కొందరు బిఆర్ఎస్ నాయకుల హస్తం ఉందని వివరించారు. దీనిపై దృష్టి సారించి ఆర్టీసీ స్థలం కబ్జా కాకుండా చూడాలని కొన్ని రోజుల క్రితం ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో అక్కడే నిరవధిక దీక్షకు దిగుతామని హెచ్చరించారు. కలిసిన వారిలో ఐఎన్టీయూసీ బేల మండల అధ్యక్షుడు ఎండీ అఖిల్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు మడావి చంద్రకాంత్, విపిన్ ఠాక్రే, అవినాష్ గోడే, రాకేష్ బాన్కర్, బొక్రే శంకర్, నరేందర్, సుమిత్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్, ఐఐటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎంబిబిఎస్, ఐఐటిలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నూతన అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంబిబిఎస్, ఐఐటిలలో ప్రతిభ కనబరిచిన కత్తి సాత్విక, సేర్ల నిహాల్ చైతన్య, పేర్ల నవనీత్, రొడ్డ జాహ్నవితో పాటు వారి తల్లిదండ్రులను సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చందల రాజన్న మాట్లాడుతూ ఎంబిబిఎస్, ఐఐటిలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అభినందనీయులన్నారు. భవిష్యత్తు తరాలకు ఆదర్శమవుతూ, సమాజానికి సేవ చేయాలని సూచించారు. చదువు ఒక్కటే ఆయుధంగా చేసుకొని ప్రపంచంలో ఎవరూ సంపాదించని డిగ్రీ పట్టాలను అంబేద్కర్ సంపాదించారని తెలిపారు. అణచివేత, అవమానాలు భరించి కూడా నాలెడ్జ్ ఆఫ్ సింబల్‌గా మారారని పేర్కొన్నారు. ఆ మహనీయున్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇటీవల తెలంగాణా దశాబ్ది ఉత్సాహల్లో భాగంగా విద్యా దినోత్సవ రోజు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ సేవా పురస్కారం పొందిన కత్తి శ్రీధర్ బాబుకు, ఇటీవల న్యాయ పట్టా పొందిన నలగంటి నవీన్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు అజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిపల్లి నాగన్న, నాయకులు ఈర్ల దయాకర్, ఇజ్జగిరి సంజీవ్, ఏవన్, రొడ్డ సాగర్, సేర్ల చిన్నయ్య, అట్ల ఆశోక్, శ్రీనివాస్, కత్తి శ్రీహరి, సేర్ల మధుకర్, రాజు, దత్తు, శివన్న, కత్తి సంతోష్, నగేష్, వసంత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని మాలేబోరిగాం, ధర్మగూడెం, కేబి కాలనీలో బుధవారం గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించింది. మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రైతు, యువత డిక్లరేషన్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రెండు లక్షలు రూపాయలు మాఫీ చేస్తామన్నారు. ఎకరాకు రూ.15000 రైతుబంధు ఇస్తామన్నారు. భూమి లేని పేదలకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామన్నారు. ప్రతి ఆడబిడ్డకు రూ.500 వంట గ్యాస్ సిలిండర్‌కు ఇస్తామన్నారు. ఇంట్లో ఇద్దరు వృద్ధులుంటే కనీసం రూ.5000 పెన్షన్, పోడు భూములకు పట్టాలు ఇస్తామన్నారు. దరణిని రద్దు చేస్తామన్నారు. మహిళలకు ఉచితంగా బస్సులో ప్రయాణించే సౌకర్యం కల్పిస్తామని, పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మాదిరిగా రూ.5లక్షల ఆర్థికసాయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, డిసిసి అధ్యక్షులు సాజిద్‌ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆనందరావు, జంగు పటేల్, రాము పటేల్, శ్యాంరావు పటేల్, మాన్కు పటేల్, భీంరావు పటేల్ , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డివి కృష్ణ ప్రథమ వర్ధంతి సభ వాల్ పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో సిపిఐ-ఎంఎల్ ప్రజాపంథా వ్యవస్థాపకులు డివి కృష్ణ ప్రథమ వర్ధంతి సభను 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని జిల్లా కార్యదర్శి రాజన్న అన్నారు. బుధవారం కార్యాలయంలో సంబంధిత వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. డివి కృష్ణ తన జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేశాడన్నారు. శక్తి వంచన లేకుండా ప్రజల కోసం పనిచేశాడని, ఆయన ఆశయాలతో ముందుకు పోదామని పేర్కొన్నారు. ప్రజల కోసం బడుగు, బలహీన వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేశారని, ఆయన అడుగుజాడల్లో నడవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బక్కన్న, గంగన్న, సమత, లక్ష్మి, రేష్మ, గంగామణి పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు మూసెయ్యాలని సీఐకి వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని మద్యం బెల్ట్ షాపులను మూసివేయాలని రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు సందీప్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ మహిళా విభాగం నాయకులతో కలిసి టూటౌన్ సీఐ, ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని తాటిగూడ కాలనీలో కొంతమంది అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారన్నారు. దీనివల్ల కార్మికులు యువత చెడు అలవాట్లకు బానిస అవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే బెల్ట్ షాపులను మూసివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్పిఐ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ష కాంబ్లె, ఉపాధ్యక్షురాలు ఆర్తి కానిందే, కార్యదర్శి శిరీష కదం, టౌన్ అధ్యక్షులు అబ్దుల్ వసీం, ఆర్తి మేశ్రా, సుజాత, శాంతాబాయి, లక్ష్మి పాల్గొన్నారు.

గోబర్ గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలి



నవతెలంగాణ-సారంగాపూర్

రైతులు గోబర్ గ్యాస్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అడెల్లి ఆలయ సమీపంలో గల హరితవనంలో ఉపాధి హామీలో నిర్మిస్తున్న గోబర్ గ్యాస్ ప్లాంట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.`రైతులు గోబర్ గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే ఎల్పిజి సిలిండర్ ఖర్చు భారం తగ్గుతుందన్నారు. గోబర్ గ్యాస్ ప్లాంట్‌తో సులభంగా వంట గ్యాస్ తయారవుతుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, ఎంపిడిఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఎపిఓ లక్ష్మారెడ్డి, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీదేవి, గ్రామ సర్పంచ్ సుచరిత రాజేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఈసి సాగర్, టిఏ రమణ, ఎఫ్ఏ శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కేసులకు భయపడం : మాజీ ఎంపీ రాథోడ్ రమేష్



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల గొంతుకను నొక్కి అరాచక పాలన సాగిస్తోందని మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు కేసు విషయంలో ఆయన బుధవారం పట్టణంలోని కోర్టుకు హాజరైన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని ఎండగడుతూ గతంలో కడెం మండలంలో రాస్తారోకో చేస్తే తనపై, 22 మంది కార్యకర్తలపై పోలీసులతో అక్రమ కేసులు పెట్టించారని అన్నారు. బీజేపీ ప్రజల కోసం పోరాటం చేస్తే ప్రభుత్వం కేసుల్లో ఇరికించి కోర్టుల చుట్టూ తిప్పడం సమంజసం కాదని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు మాట్లాడకుండా ప్రభుత్వం గొంతు నొక్కాలని చూస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ప్రజలకోసం ఎన్ని కేసులనైనా భరించడానికి బీజేపీ నాయకులు సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఈయన వెంట న్యాయవాదులు బాషెట్టి శివ, ఐదు వెంకటేశ్, పార్టీ నాయకులు బుచ్చన్న యాదవ్, మల్లేష్, పరమేశ్వర్‌గౌడ్, రమేష్ గౌడ్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



నవతెలంగాణ-తాంసి

కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు, కులాలకు సముచిత న్యాయం జరుగుతుందని టిపిసిసి సభ్యులు డాక్టర్ వన్నెల అశోక్ అన్నారు. బుధవారం భీంపూర్ మండలంలోని వడూర్ గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా రేవంత్‌రెడ్డి నాయకత్వంలో యువత కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. రైతులకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు అందరికీ న్యాయం జరగాలంటే కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి సైనికులుగా పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అన్ను పటేల్, గంగారాం, రాజబలి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నైతిక విలువల పరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సప్లమెంటరీ నైతికత, మానవ విలువల పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ పలు సెంటర్లు సందర్శించి పరీక్ష నిర్వాహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన, గైర్హాజరైన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షల్లో భాగంగా నైతికత, మానవ విలువల పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ 265, ఒకేషనల్ 118, మొత్తం 383 మంది విద్యార్థులకు 67 మంది హాజరుకాగా, 316 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

కాసిపేట-2 ఇంక్లైన్ గని మ్యాన్ రైడింగ్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో మ్యాన్ రైడింగ్ పనులను బుధవారం గని మేనేజర్ లక్ష్మీ నారాయణ ప్రారంభించారు. ఈ సంధర్భంగా మేనేజర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 5 నెలల్లో మ్యాన్ రైడింగ్ పనులు పూర్తి చేసి గని ఉత్పత్తి పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ కారుకూరి తిరుపతి, వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, సేఫ్టీ ఆఫీసర్ సంతోశ్ రావు, ఇంజనీర్ రఘు, అండర్ మేనేజర్ శ్యాంసుందర్, సర్వేయర్ ప్రకాశ్, కొత్తపల్లి శంకరయ్య, రాజ కొమురయ్య పాల్గొన్నారు.

గిరి వికాస్ పథకాన్ని కొనసాగించాలి



నవతెలంగాణ-కెరమెరి

గిరి వికాస్ పథకాన్ని కొనసాగించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్ లాల్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పాత్రికేయులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. జిల్లాలో అనేక మంది గిరిజనులు పోడు వ్యవసాయం సాగుపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి పోడు సాగుదారులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గిరి వికాస్ పథకంలో సాగునీటి సౌకర్యం వల్ల పోడు సాగుదారులు మూడు కాలాల్లో పంటలు పండించి రైతు ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉందన్నారు. పోడు సాగుదారుల సంక్షేమం కోసం గత ఆరు నెలల క్రితం వరకు అమలు చేసిన గిరి వికాస్ పథకాన్ని నిలిపివేయడం సరైందికదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గిరివికాస్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నార్‌పల్లి సర్పంచ్ రాథోడ్ శేషారావ్, బాలాజీ పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో ట్రేడ్స్ మెన్ బిల్డింగ్ ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన ట్రేడ్స్ మెన్ బిల్డింగ్, వేదిక, విశ్రాంత హాల్‌ను బుధవారం డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి, సింగరేణి అధికారులు, యూనియన్ నాయకులతో కలిసి డైరెక్టర్ మొక్కలను నాటారు. ఈ సందర్భముగా, డైరెక్టర్ (ఈ అండ్ యం) సత్యనారాయణ మాట్లాడుతూ కొత్త సీహెచ్‌పీలో వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు శుభ్రంగా ఉండడం చాల అభినందనీయమని కొనియాడారు. ఎస్ఆర్‌పీఓసీపీలో రానున్న వర్షాకాలాన్ని దష్టిలో ఉంచుకొని అనుకున్న లక్ష్యాన్ని చేరాలని తెలిపారు. అలాగే చెన్నూరులో చేపడుతున్న సోలార్ ప్రాజెక్టును పూర్తి చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సీహెచ్‌పీ డీజీఎం డి.వెంకటేశ్వర్‌రావు, ఏరియా నాయకులు జీఎం కమిటీ మెంబర్స్ పెట్టం లక్ష్మణ్, కుమార స్వామి, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరి బాజి సైదా, ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు, బీఎంఎస్ ఏరియా సెక్రటరీ చంద్రశేఖర్, సీఐటీయూ కార్యదర్శి భాగ్యరాజు, సుధాకర్, ఎస్ఓ టు జీఎం గోపాల్ సింగ్, ఏరియా ఇంజినీర్ జి.రమేష్ బాబు, ఏరియా సివిల్ డీజీఎం జి.శివరావు, ఏరియా డి.జియం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీఓ కాంత రావు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడానికి సిద్ధం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు బీఎస్ఎన్ఎల్ డీఈ శ్రీధర్ తెలిపారు. స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛైంజ్‌లో వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే బీఎస్ఎన్ఎల్ అభివృద్ధి చెందుతుందని నాణ్యమైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ సేవలు వినియోగించుకోవాలన్నారు. ఇతర టెలికం సంస్థలతో పోలిస్తే బీఎస్ఎన్ఎల్‌లో టారిఫ్ రేట్లు తక్కువగా ఉన్నాయని గుర్తు చేశారు. సెల్ ఫోన్ వినియోగదారులను ఆకర్షించడానికి భవిష్యత్తులో మరిన్ని పథకాలు తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్డిఈ రవికుమార్, సురేందర్, సదానందం, జేటీఓలు తిరుపతి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని చిన్న ధర్మారం, కోమటిచేను గ్రామ పంచాయతీలోని నర్సరీలను బుధవారం ఎంపీడీఓ ఎంఏ అలీం పరిశీలించారు. ఈ సంధర్భంగా నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. ఈ సంధర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఆలోచన మెరిసే..జపాన్ పిలిచే..

- చిన్న వయసులోనే కొత్త ఆవిష్కరణకు శ్రీకారం
- గొడుగుతో ఫీడింగ్ చాంబర్(పసి పిల్లలకు పాలిచ్చే గది) ఏర్పాటు
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు
- బీబ్రా గ్రామ విద్యార్థి ఘనత

నవతెలంగాణ-దహెగాం

విద్యార్థి ఆలోచన మెరిసింది. తాను రూపొందించిన ఆవిష్కరణకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో విద్యార్థి ఆనందానికి అవదుల్లేకుండా పోయాయి. ఇండోవేశన్ ఫౌండేషన్ ఇన్‌స్పైర్ జాతీయ స్థాయి మేళాలో ప్రదర్శించిన ఫీడింగ్ చాంబర్ ప్రాజెక్టు ఆవిష్కరణకు ఆకర్షితులై జపాన్ ప్రభుత్వం సకూర సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాం కార్యక్రమం ద్వారా వారి దేశ సందర్శనకు అవకాశం కల్పించింది. అంతేకాకుండా అక్కడి శాస్త్ర సాంకేతిక విధానం నూతన ఆలోచనలు ఆవిష్కరణ రూపకల్పనలకు, సృజనాత్మకతను పెంపొందించుకొనేలా ఆహ్వానం పలికింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం బీబ్రా గ్రామానికి చెందిన జుమ్డి అంజన్న ఎంపిక కావడం పట్ల కుటుంబసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయమే కుటుంబానికి ఆధారం...

దహెగాం మండలం బీబ్రా గ్రామానికి చెందిన జుమ్డి రాజన్న-సుగుణ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కాగా వీరిది నిరుపేద కుటుంబం. ఉన్న కాస్తంత భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో అంజన్న మూడవ వాడు. అంజన్నను స్థానిక బీబ్రా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆరో తరగతి వరకు చదివించి అనంతరం మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం మల్కెపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చేర్పించగా 10వ తరగతి పూర్తిచేశాడు. 9వ తరగతి చదువుతుండగానే ఆయన జీవితం నూతన ఆవిష్కరణకు నాంది పలికింది.

వయసులో చిన్న.. ఆలోచనలో మిన్న..

9వ తరగతి చదువుతున్న సమయంలోనే వయసులో చిన్నవాడైన అంజన్నకు ఒక్క ఆలోచన వచ్చింది. కాగా ఒకరోజు తాను బహిరంగ ప్రదేశంలో నడుచుకుంటూ వెళున్నప్పుడు రద్దీగా ఉన్న ప్రదేశంలో తల్లి ఒడిలో చిన్న బాబు ఆకలితో ఏడుస్తుండడం గమనించాడు. ఆకలితో బాబు ఏడుస్తున్నాడనే విషయం తెలిసినా కూడా తన తల్లి జన సందోహం కారణంగా పాలు పట్టలేక ఇబ్బంది పడుతుందని అంజన్న మనసులో ఆలోచించసాగాడు. భవిష్యత్తులో ఇలా ఎవరు ఇబ్బంది పడొద్దనే ఆలోచనతో ఏదో ఒక ప్రయోగాన్ని ఆవిష్కరణను ఆవిష్కరించాలని మనసులో తలచుకున్నాడు. వెనువెంటనే దీనికి గొడుగు ద్వారా ఫీడింగ్ చాంబర్ ఏర్పాటు చేయొచ్చనే ఆలోచనను పదునుపెట్టి నూతన ఆవిష్కరణకు శ్రీకారం చుట్టారు.

సులభంగా సౌకర్యవంతంగా..

ప్రతి మహిళ తమ పిల్లలతో పాటు ప్రయాణం చేయకతప్పదు. అలాంటి వారు చంటి బిడ్డలకు పాలు ఇవ్వాలంటే ఇబ్బంది పడకుండా ఉండాలని తక్కువ ఖర్చుతో సౌకర్యవంతంగా ఉండేలా ఫీడింగ్ చాంబర్‌ను ఏర్పాటుచేశాడు. ఒక గొడుగుకు చుట్టూ ఒక క్లాత్ ఏర్పాటుచేశాడు. దానిలో ఒక వైపు నుండి గాలి, వెలుతురు రావడానికి క్లాతులోని కొంతభాగంలో ఒక కిటికీని ఏర్పాటుచేశాడు. పసి పిల్లలున్న మహిళలు తమ వెంట ఈ పరికరాన్ని బ్యాగులో ఉంచుకున్నట్టయితే అవసరమున్నప్పుడు గొడుగును తెరిస్తే తాము ఉన్నచోటనే ఆటోమేటిక్ ఫీడింగ్ చాంబర్‌లా వాడుకోవచ్చు.



మంచిర్యాల కలెక్టర్, ఇతర ప్రముఖులతో అవార్డు అందుకుంటున్న అంజన్న(ఫైల్)

అంజన్నకు జాతీయ అవార్డు...

కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఎండోనేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్‌లో అంజన్న తయారుచేసిన ఫీడింగ్ చాంబర్ ప్రాజెక్టు ప్రదర్శన జాతీయస్థాయిలో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. దేశవ్యాప్తంగా నాలుగు లక్షల ప్రాజెక్టులు నమోదు చేసుకోగా జాతీయస్థాయికి వెయ్యికిపైగా ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. వీటన్నింటిలో టాప్ 60 కోసం ప్రత్యేక పోటీ నిర్వహించగా అంజన్న ప్రదర్శించిన ఫీడింగ్ చాంబర్ ప్రాజెక్టు నాలుగో స్థానంలో నిలిచింది. దీంతో 2021, డిసెంబర్‌లో బెంగుళూరులోని ఎన్ఐఏఎస్ చైర్మన్ విటిన్‌కుమార్, ఇస్రోచీఫ్ టీఎస్ గోయెల్ చేతులమీదుగా బహుమతి అందుకున్నాడు. అంతకుముందు జిల్లా, రాష్ట్రస్థాయిలోనూ అనేక బహుమతులను అందుకోగా నవంబర్ 5న జపాన్ దేశం పిలుపు మేరకు అక్కడికి వెళ్లి ప్రదర్శన ఇవ్వనున్నట్టు అంజన్న పేర్కొన్నారు.



బెంగుళూర్‌లో అంజన్నను అభినందిస్తున్న ఇస్రో చైర్మెన్, ఎన్ఐఏఎస్ చైర్మెన్



కుటుంబ సభ్యులతో అంజన్న

సివిల్స్ సాధించడమే లక్ష్యం

- జుమ్డి అంజన్న, బీబ్రా గ్రామ విద్యార్థి



నేను తయారుచేసిన ఫీడింగ్ చాంబర్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు రావడం, అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది. అలాగే జపాన్ దేశం నుండి కూడా దేశ సందర్శనకు నూతన ఆవిష్కరణల రూపకల్పనకు పిలుపు రావడం సంతోషంగా ఉంది. నా ప్రయోగానికి నా కుటుంబసభ్యులతో పాటు ఉపాధ్యాయుడు రమేష్ ప్రోత్సాహం మరిచిపోలేనిది. ప్రస్తుతం ఇంటర్ పూర్తయింది. ఒకవైపు నూతన ఆవిష్కరణలకు పదును పెడుతూనే మరోవైపు సివిల్స్ సాధించడమే నా లక్ష్యం.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- జడ్పీ చైర్ పర్సన్ కోవలక్ష్మి
- ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలోని హిందూ ముస్లిం క్రిస్టియన్ వర్గాలతో పాటు అన్ని వర్గాల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవ ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు చర్చిలో మసీదుల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కషి చేస్తోందని తెలిపారు. గత 20 రోజులుగా దశాబ్ది ఉత్సవ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయని వీటి ద్వారా ప్రతి శాఖలో తాము చేసిన అభివృద్ధి కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ సస్యశ్యామల తెలంగాణకు దేవుని కృప అవసరమని అన్నారు. తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని తెలిపారు. దీనికి దేవుని కృప కూడా అవసరమని అన్నారు. ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక పూజలు ఒక గొప్ప సంస్కృతిని తెలుపుతాయన్నారు. ఎమ్మెల్యే



ఆత్రం సక్కు మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ తేడా లేకుండా ప్రతి వర్గంలోని ప్రజలను కన్నబిడ్డలుగా చూసుకుంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఆయా వర్గాల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు కొనసాగుతున్నట్లు వివరించారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విందు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, సింగిల్విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్ పాల్గొన్నారు.

చిర్రకుంటలో ఎంపీపీ ప్రత్యేక పూజలు

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవ ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో మండలంలోని చిరకుంట గ్రామంలో శివాలయంలో ఎంపీపీ మల్లికార్జున్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. దానిలో భాగంగానే ఆధ్యాత్మిక దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరిగెల మహేష్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేస్తాం



నవతెలంగాణ-కోటపల్లి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని పీసీసీ సభ్యుడు నూకల రమేష్ అన్నారు. చెన్నూరు మండలంలోని సంకారం, బుదారం, కనేపెల్లి గ్రామాల్లో హత్ సే హత్ జోడో యాత్రలో భాగంగా బుధవారం ఆయన గడపగడపకు ప్రచారం చేశాడు. గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుంటూ ప్రజలకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు అందే సంక్షేమ పథకాలను వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష ఉద్యోగాల భర్తీ ఏకకాలంలో చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగం లేని వారికి రూ.4,000 నిరుద్యోగ భృతి అందజేస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని కేసీఆర్ అమలు చేయడం లేదని ఆరోగ్య శ్రీ వల్ల పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయని అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరోగ్యశ్రీకి నిధులను పెంచుతామని అన్నారు. ధరణి దరిద్రంగా తయారయిందని ధరణి వల్ల పేద ప్రజలు చాలా నష్టపోయారని బీఆర్ఎస్ నాయకులు ధరణిని అడ్డం పెట్టుకొని అనేక ప్రభుత్వ భూములను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారని ఆరోపించారు. ధరణి వల్ల ప్రతి గ్రామంలో భూ సమస్యలు పెరిగాయని వ్యక్తి భూమిని కొనుగోలు చేసిన కానీ పాత వ్యక్తి పేరు కనిపిస్తుందని ఇలాంటి సమస్యలు ఎన్నో ధరణిలో నిక్షిప్తమై ఉన్నాయని వివరించారు. రేషన్ షాపులలో తొమ్మిది రకాల నిత్యావసర సరుకులను అందించి ప్రజలను ఆదుకుంటామని అన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించి రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగిరేలా చేతి గుర్తుకు ఓటు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గజ్జల అంకగౌడ్, నాయకులు ముత్యాల బాపాగౌడ్, మహేష్, ప్రసాద్ తివారీ, చెన్న సూర్య నారాయణ, దంతెల మదునయ్య, గాలిపెల్లి తిరుపతి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారానికి కృషి చేయాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రజలకు సేవలు అందించే దిశగా పోలీసులు పనిచేయాలని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని సిబ్బందితో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌ల వారిగా పెండింగ్ కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరస్తులకు చట్ట ప్రకారం శిక్ష పడే విధంగా చూడాలని సూచించారు. రానున్నది ఎన్నికల సమయమని శాంతియుత ఎన్నికల నిర్వహణకు పోలీసులు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిలో బందోబస్తు ఏర్పాట్లపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వారిని విచారించాలన్నారు. గ్రామ మండల స్థాయిలో ఇప్పటికే సీసీ కెమెరాలు అమర్చడం జరిగిందని ఎక్కడైనా సీసీ కెమెరాలు లేకపోయినా పని చేయకపోయినా వాటిని తిరిగి ఏర్పాటు చేయాలన్నారు. గోవుల అక్రమ రవాణా గోవధను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోవులను సంతలో కొనుగోలు చేసినట్లయితే దానికి సంబంధించిన రసీదు సంబంధిత వ్యక్తి వద్ద ఉండేలా చూడాలన్నారు. గోవుల రక్షణకు సంబంధించి కొంతమంది ముఠాలుగా ఏర్పడి అల్లర్లు సృష్టించే అవకాశం ఉంటుందని అటువంటి వారిపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. శాంతియుత వాతవరణాన్ని నెలకొల్పేందుకు పోలీసులు అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. దశాబ్ది ఉత్సవాలు జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేసిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ సుధాకర్, డీసీఆర్‌బీ సీఐ పవన్ కుమార్, డీపీఓ ఏఓ శ్రీనివాస్‌రెడి పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని రవీంద్రనగర్-2 గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప భూమి పూజ చేశారు. నూతన మండలం ఏర్పడిన తర్వాత మొట్ట మొదటిసారిగా రవీంద్రనగర్-2 గ్రామపంచాయతీ భవనానికి ఎన్ఆర్‌జీఎస్ నిధుల ద్వారా రూ.20 లక్షల నిధులమంజూరు అయ్యాయని తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు డుబ్బుల వెంకన్న, వైస్ ఎంపీపీ మనోజిత్ మండల్, సర్పంచ్ సుశీల్, ఎంపీఓ సుధాకర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

ఆచార్య జయ శంకర్ వర్ధంతి



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో భారత జాగృతి ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి భారత జాగృతి మండల అధ్యక్షుడు సోదారి సురేశ్, నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భారత జాగృతి మండల అధికార ప్రతినిధి గంగాధరి, రాజ్ కుమార్, కోశాధికారి కనక వంశీ కృష్ణ, కాసిపేట జేపీ అధ్యక్షుడు దుర్గం శేఖర్, లంక రాకేశ్, రత్నం వంశీ, ఎస్కే బాబర్, గెడం శేఖర్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

గురువారం 22 జూన్ 2023

అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని ఈదులవాడ గ్రామపంచాయతీ మారిశెట్టి గూడలో వృద్ధుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పట్టణ సీఐ రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారిశెట్టి మల్లయ్య(75) రోజులాగే ఇంటి ముందు మంచం వేసుకొని మంగళవారం రాత్రి నిద్రించాడు. తెల్లవారుజామున ఆయన కూతురు వాకిలి శుభ్రం చేస్తూ తండ్రిని లేపడానికి ప్రయత్నం చేసింది. ఎంతకు ఆయన లేవకపోవడంతో కుటుంబ సభ్యులకు పిలిచి లేపడానికి ప్రయత్నం చేసే క్రమంలో మెడమీద ఏదో తెలియని ఆయుధంతో కట్ చేసినట్లు గుర్తించారు. దీనితో అప్పటికే మల్లయ్య చనిపోయాడని గుర్తించిన పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి రెండవ కూతురు అత్తగారి తరుపున ఒక వ్యక్తి గతంలో చంపుతానని బెదిరించాడని ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మున్సిపల్ చైర్మన్‌ను సన్మానించిన టీఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదిలాబాద్ టౌన్ : ఇటీవల జరిగిన రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో ఆదిలాబాద్ పురపాలక సంఘం పలు అవార్డులను సాధించడంతో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో పాటు కమిషనర్ శైలజలను వివిధ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అందులో భాగంగానే బుధవారం టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్‌ను శాంతినగర్‌లోని తన నివాసంలో కలిసి షాలువ, పుష్పగుచ్ఛలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అదేవిధంగా కమిషనర్‌ను సైతం సత్కరించరు. ఆదిలాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో ఇలాగే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ మాదిగ, అధికార ప్రతినిధి నక్క రాందాస్ మాదిగ, జిల్లా ప్రధాన జువాక నర్సింలు, జిల్లా కోశాధికారి లింగంపల్లి ప్రసన్నకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కత్తి గంగాధర్, జిల్లా కార్యదర్శి తారా రవి, కల్లేపల్లి మల్లయ్య, గోడికే మధుకర్, సిందే సంజయ్ ఉన్నారు.

ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా తప్పనిసరి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- జిల్లాలో ఘనంగా యోగా దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించాలంటే తప్పనిసరి ప్రతి నిత్యం యోగాభ్యాసం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ పార్క్ ఆవరణలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగ మనదేశం నుండి ప్రపంచమంతా వ్యాప్తి చెందిందని చెప్పడానికి గర్వంగా ఉందని తెలిపారు. ప్రతిరోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని, జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో త్వరలో యోగా తరగతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉప వైద్యాధికారులు సుధాకర్ నాయక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ భవనంలో

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ బాబు, ఏజీపీ దీపక్ రావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్ కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో

జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో యోగా దినోత్సవం సందర్భంగా షీ టీం సిబ్బందితో కలిసి విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది సునీత, స్వప్న, ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : యోగా దినోత్సవ వేడుకలను బుధవారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక పటేల్ గార్డెన్‌లో భారత్ స్వాభిమాన్ ఆధ్వర్యంలో తొమ్మిదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, భారత్ స్వాభిమాన్ జిల్లా అధ్యక్షులు ఎం రవీంద్రగౌడ్ హాజరయ్యారు. యోగా గురువు దాసరి వినోద్‌గౌడ్ యోగ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతీ రోజు యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్సింగుల రఘురాం, ప్రకాష్ మాలి, రంగస్వామి, కొంగ సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యూట్రిషన్ ప్లస్ ఆధ్వర్యంలో..

స్థానిక ఎస్పీఎం క్రీడా మైదానంలో న్యూట్రిషన్ ప్లస్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. డాక్టర్ సుమిత్‌గుప్తా ఆధ్వర్యంలో యోగా శిక్షకులు హీనా టంక్, దానాజీ మాలి యోగా కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ యోగా మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూట్రిషన్ ప్లస్ సభ్యులు పాల్గొన్నారు.

రెబ్బెన : బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ జీ.దేవేందర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం గోలేటి సీఈఆర్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. యోగా శిక్షకులు రాజలింగు, రాజ్యలక్ష్మీ, కుమారి అలేఖ్య యోగాసనాలు వేశారు. కొన్ని ముఖ్యమైన ఆసనాలను కార్యక్రమానికి హాజరైన వారితో చేయించారు. ఆసనాల ప్రాముఖ్యతను వివరించారు. యోగా శిక్షకులను జీఎం దేవేందర్, సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపరాణి సన్మానించి బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, ఎస్ఓటు జీఎం కెహెచ్ఎన్ గుప్తా, పీఓ ఉమాకాంత్, ఏజీఎం తిరుమలరావు, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, డీజీఎం ఎఫ్ అండ్ ఎ రామారావు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహెర, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి జీకె కిరణ్‌కుమార్, సేవా సమితి సభ్యులు సొల్లు లక్ష్మి, కుందారపు శంకరమ్మ పాల్గొన్నారు.

కోటపల్లి : ప్రతిఒక్కరూ ఆహారంలో మార్పులు చేసుకుంటూ ప్రకృతికి అనుకూలంగా మారాలని జనగామ సర్పంచ్ గట్టు లక్ష్మణ్ గౌడ్ అన్నారు. బుధవారం యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయితీ ఆవరణలో సామూహిక యోగా అభ్యసన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యంతో సహా శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా అనేక ప్రయోజనాలను కల్గిస్తుందన్నారు. ఒత్తిడి, ఆందోళన, నిరాశను తగ్గించడంలో, నిద్రను మెరుగుపరచడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం యోగా చేస్తూ ప్రజల జీవన నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలని అన్నారు.

చింతలమానేపల్లి : మండలంలోని డబ్బా గ్రామంలో అమృత్ సరోవర్ వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఏపీఓ గోవర్ధన్ సింగ్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలతో బుధవారం యోగా చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ డుబ్బుల నానయ్య హాజరై యోగా ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో టోంబ్రే మారుతి, డోంగ్రే సంతోష్ ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జన్నారం : యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, తపాల్‌పూర్ గ్రామ సర్పంచ్ సైనాల తిరుపతి అన్నారు.



బుధవారం ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని తిమ్మాపూర్ గ్రామంలోని గోదావరి నది ఒడ్డున ఉన్న రామాలయంలో తపాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో వేర్వేరుగా, గ్రామస్తులతో యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. యోగాతో సుదీర్ఘ రుగ్మతలు దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దర్శనాల వెంకటస్వామి, గ్రామస్తులు చంద్రయ్య, గంగయ్య పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ కాలనీలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఓరియంట్ అధికారులు, పోలీస్ అధికారులు, ఓరియంట్ ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబీకులు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు, ప్రాణాయామాలు చేశారు. ఈ సందర్భంగా ఓరియంట్ హెడ్ ఎంపీ జ్యోషి మాట్లాడుతూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు పాల్గొని యోగ విశిష్టలను అందరికీ వివరించారు. అదేవిదంగా మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గని అధికారులు, ఉద్యోగులు యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాసిపేట ఏ గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, మేనేజర్ లక్ష్మీనారాయణ, టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి పాల్గొన్నారు.

నస్పూర్ : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా ఉండాలని చెప్పారు. అలాగే ఎస్ఆర్పీ 3,3ఏ గనిలో డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నుంచి వచ్చిన యోగా శిక్షకులు ఉద్యోగులకు యోగ చేయించారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిలో ప్రాజెక్టు ఆఫీసర్ పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులతో యోగ ప్రతిజ్ఞ చేయించారు. ఆర్కే-6 గనిలో సూపరిండెంట్ ఆఫ్ మైన్స్ తిరుపతి ఆధ్వర్యంలో రాధాకృష్ణ యోగాచార్యులచే యోగాసనాలపై అవగాహన కల్పించారు. మున్సిపాలిటీ పరిధిలోని రెయిన్బో పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు యోగాసనాలు వేసి యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, యూనియన్ నాయకులు, రెయిన్బో పాఠశాల కరస్పాండెంట్ అమన్ ప్రసాద్ పాల్గొన్నారు.

దహెగాం : మండలంలోని గెర్రె గ్రామంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు, గ్రామస్తులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని, వ్యాధులు దూరమవుతాయని, శరీరం ఉత్సాహంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రమేష్, ఏపీఓ కల్పన, పంచాయతీ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.


కాగజ్‌నగర్‌లో..


దహెగాంలో..


కాసిపేటలో ..


నస్పూర్‌లో ..

ఎస్పీఎం కార్మికుల ఇండ్లలో చోరీ

- వెండి, బంగారు నగలతో పాటు నగదు చోరీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో పని చేసే ఇద్దరు కార్మికుల ఇండ్లలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. బాధితులు తెలిపిన ప్రకారం ఎస్పీఎం కార్మికుడు మేడిపల్లి మల్లేష్ న్యూకాలనీలో టెంపుల్ కాంప్లెక్ సమీపంలో ఓఆర్‌టీ-341లో నివాసముంటున్నాడు. మంగళవారం రాత్రి డ్యూటీకి వెళ్లగా అతని భార్య భాగ్య క్వార్టర్‌కు తాళం వేసి పుట్టింటికి వెళ్లింది. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాన్ని పగులకొట్టి బీరువాలో ఉన్న 40 తులాల వెండి ఆభరణాలు, రూ.2వేల నగదు చోరీ చేశారు. బుధవారం ఉదయం డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చిన మల్లేష్ తాళం పగులకొట్టి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీనికి సమీపంలోనే ఉన్న మరో క్వార్టర్ ఓఆర్‌టి-348లో పూదరి రవీందర్ నివాసముంటున్నాడు. ఇతను కూడా మంగళవారం రాత్రి డ్యూటీకి వెళ్లగా ఇతని భార్య సరిత పుట్టింటికి వెళ్లింది. వెనుక వైపు ఉన్న తలుపును పూర్తిగా తొలగించి దొంగలు లోనికి ప్రవేశించి బీరువాలో ఉన్న తులం బంగారు గొలుసు, రూ.84 వేలను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై అంజయ్య కేసు నమోదు చేశారు.

గూడెం ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-దండేపల్లి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ దంపతులు, ఎమ్మెల్యే దివాకర్‌రావు హాజరై సత్యదేవునికి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో వేదపారాయణం, సుదర్శన హోమం, భజన హరి నామ సంకీర్తన తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా వీరికి ఆలయాధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలతో ఘనంగా సత్కరించారు. వీరితో అదనపు కలెక్టర్ రాహుల్ రాజ్, శిక్షణ కలెక్టర్ గౌతమి, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, తహసీల్దార్ హన్మంతరావు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎంగా పనిచేసి బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ అధికారిగా బదిలీపై వెళ్తున్న కెహెచ్ఎన్ గుప్తాను జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం అధికారులు సన్మానించారు. జీఎం దేవేందర్ అధికారులతో కలిసి శాలువాతో సన్మానించి పూల మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా జీఎం దేవేందర్ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీఓ ఉమాకాంత్, ఏజీఎం తిరుమలరావు, డీవైపీఎంఓ శౌరి, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, డీజీఎం(ఎఫ్ అండ్ ఎ) రామారావు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహెర, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యున్ని కలిసిన ప్రణయ్

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



ప్రగతి భవన్‌లో రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌ను బుధవారం స్వాస్ ఎన్‌జీఓ అధ్యక్షులు కారింగుల ప్రణయ్ మర్యాదపూర్వకంగా కలిసారు. పచ్చదనం పెంపు, పర్యావరణ హితమే లక్ష్యంగా ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళ్తున్న గ్రీన్ ఇండియా ఛాలెంజ్ 5 వసంతాలు పూర్తి చేసుకుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి చెట్ల పెంపకంపై అవగహన కలిగేలా ప్రముఖ కార్టునిస్ట్ మృత్యుంజయ చిలువేరు వేసిన 300 కార్టున్‌లతో వేసిన హరిత హారం ట్రీ ట్రూన్స్ పుస్తకాన్ని ఎంపి సంతోష్ కుమార్‌కు ప్రణయ్ బహుకరించారు.

నవోదయ ప్రవేశపరీక్ష ఫలితాల విడుదల

కాగజ్‌నగర్ : 2023-24 విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి గాను ఏప్రిల్ 29న నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలైనట్లు విద్యాలయం ప్రిన్సిపల్ బి.చక్రపాణి తెలిపారు. విద్యాలయంలో ఖాళీగా ఉన్న 80 సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఈ ప్రవేశపరీక్షకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 5,920 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 5,351 మంది విద్యార్థులు హాజరైన విషయం తెల్సిందే.

విద్యార్థులు తమ హాల్‌టిక్కెట్ నెంబర్, పుట్టిన తేదీ వివరాలతో సీబీసెట్.ఇన్/సీబీఎస్‌సీ/2023/ఎన్‌వీఎస్‌రిజల్ట్/రిజల్ట్.ఏఎస్‌పీఎక్స్ లింక్ ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చని ప్రిన్సిపల్ సూచించారు.

సమ్మె నోటీసు అందజేత

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గంగాసింగ్‌కు గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై ఆరు నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటామని, జూన్ 24న జిల్లాకేంద్రంలో ప్రదర్శనలు ఉంటాయన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీఓ నెంబర్ 60 ప్రకారం మున్సిపల్ కార్మికులవలె కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు శేఖర్, దుర్గేష్, చిన్న, నారాయణ పాల్గొన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలో జూన్ 16 వరకు కొత్తగా పట్టా పాస్ బుక్ తీసుకొని ఆన్‌లైన్‌లో డిఎస్ ఆయన రైతులు 2023-2024 సంవత్సరానికి గాను రైతు బంధు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ కవిత తెలిపారు. రైతులు ఆయా క్లస్టర్ల ఏఈఓ లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతుబంధు దరఖాస్తు చేసుకోవడానికి కొత్తగా వచ్చిన పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ తీసుకొని సంబంధిత ఏఈఓ లను కలిసి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడికి సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితుడైన మండల వాసి అజ్మీరా ఆత్మారాంను ఆ పార్టీ మండల, గోలేటి పట్టణ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించిన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నా ఆజ్మెర ఆత్మారాం నాయకను రాష్ట్ర సభ్యులుగా నియమించడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో పార్లమెంటు కో కన్వీనర్ కిరణ్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, బెల్లంపల్లి అసెంబ్లీ ప్రబారి సుదర్శన్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, మండలాధ్యక్షుడు తిరుపతి, ఆసిఫాబాద్ జిల్లా యువ నాయకులు సప్త శ్రీనివాస్, కుసుమ విజయ, జిల్లా నాయకులు సతీష్, సారంగపాణి, టౌన్ ప్రెసిడెంట్ రాము, రాజేష్, శ్రీనివాస్, మడిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కళాశాలను పరిశీలించిన సివిల్ జడ్జి

నవతెలంగాణ-దహెగాం

మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆసిఫాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జీ యువరాజ పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల నిర్వహణపై హైకోర్టు సుమోటోగా కేసు స్వీకరించడంతో హైకోర్టు ఆదేశాల మేరకు కళాశాలలోని మరుగుదొడ్ల నిర్వహణ, వాటి పనితీరును పరిశీలించినట్టు పేర్కొన్నారు. ఈ నివేదికను హైకోర్టుకు అందజేస్తామని పేర్కొన్నారు.

బీసీలకు రూ.లక్ష పథకంలో ఆరె కులాన్ని చేర్చాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్థికంగా వెనుకబడిన బీసీలకు ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయం పథకంలో ఆరె కులాన్ని చేర్చాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరామ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలలో 15 కులాలకు చెందిన పేద మధ్యతరగతి ప్రజలకు చేయూతనిచ్చే విధంగా తీసుకోవాల్సిన రూ.లక్ష పథకం ఆహ్వానించదగ్గదే అయినప్పటికీ తమ కులంలో ఉన్న పేదవారికి ఈ పథకం వర్తింప చేయకపోవడం బాధ కలిగించిందన్నారు. సంవత్సరాదయం రూ.లక్ష యాభై వేలు లోపు ఉన్న పేద గ్రామీణ ప్రజలు ఆరె కులంలో ఉన్నారని గుర్తు తెలిపారు. ముఖ్యమంత్రి ఆరె కులస్తుల ఆర్థిక పరిస్థితిని గుర్తించి తమ కులాన్ని పథకంలో చేర్చాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు నరులే వాను పటేల్, జిల్లా ఉపాధ్యక్షుడు కోలే బిక్కజి, జిల్లా ప్రధాన కార్యదర్శి సప్త శ్రీనివాస్, డివిజన్ కోశాధికారి ఎలుములే దిలీప్, ప్రచార కార్యదర్శి కురత్కర్ రమేశ్, అసిఫాబాద్ మండల అధ్యక్షుడు గేడేకార్ సంతోష్ కుమార్, నౌగదే అశోక్ పాల్గొన్నారు

నర్సరీ పరిశీలన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎల్లూరు గ్రామ పంచాయతీలో నర్సరీని డీఆర్‌డీఓ సురేందర్ ఎంపీడీఓ గంగాసింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలని, వాటిని సంరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం రాజన్న, ఏపీఓ సతీష్, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, టెక్నికల్ అసిస్టెంట్ లావణ్య, రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమానందం పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



నవతెలంగాణ-బెజ్జూర్

విద్యారంగ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం మండలంలోని ఎలుకపెల్లి, గబ్బాయి గ్రామాల్లోని మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన పాఠశాలలను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో మౌళిక వసతుల కోసం మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా బెజ్జూర్ మండలంలో 17 పాఠశాలలను ఎంపిక చేసిందని, రెండు పాఠశాలలను ఇప్పటికే ప్రారంభించినట్టు తెలిపారు. త్వరలో అన్ని పాఠశాలలను ప్రారంభిస్తామని అన్నారు. పాఠశాలల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అన్ని గ్రామాల్లో రోడ్డు రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతుల కోసం రైతుబీమా, రైతుబంధు తదితర సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని ఎలుకపెల్లి(బి), చిన్నసిద్దాపూర్ బీటీ రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. త్వరలో పోడు భూముల సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, పాపన్నపేట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రభుత్వం మంజూరుచేసిన స్మార్ట్ టీవీలను ప్రారంభించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక్కో పాఠశాలకు రెండు టేబుళ్ల మంజూరుచేసిందని తెలిపారు. అనంతరం మండలంలోని పెద్దసిద్దాపూర్, తలాయి గ్రామ పంచాయతీలో నూతన గ్రామ పంచాయతీల భవనాలకు శంకుస్థాపన చేశారు. ఒక్కో భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందని, వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. పాపన్నపేట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని, ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని గ్రామస్తులు కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు కోండ్ర జగ్గాగౌడ్, జడ్పీటీసీ పుష్పలత, ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, ఎంఈఓ రమేష్‌బాబు, పంచాయతీ రాజ్ మక్బూల్ హుస్సేన్, మండల కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్, సర్పంచ్‌లు రవికుమార్, శారద, బుజాడి శేఖర్, హనుమంతు, చంద్రకళ, శంకర్, ఎంపీటీసీలు లంగారి శ్రీనివాస్, పర్వీన్ సుల్తానా, గురిజాల వెంకన్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సకారాం, యూత్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ వెంకన్న, నాయకులు జావిద్ అలీ, జావేద్ హుస్సేన్, మహేష్, రామకృష్ణ, రాజారాం, భీమన్న పాల్గొన్నారు.

'కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగిపోయారు'

- దళితులను మోసం చేసిన ఘనత కేసీఆర్‌దే
- వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం ఖాయం
- లక్సెట్టిపేట్ బహిరంగ సభలో బండి సంజయ్ వ్యాఖ్యలు

నవతెలంగాణ-మంచిర్యాల

నిధులు, నీళ్లు, నియమాకాలు పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజల పాలిట శాపంగా మారిన కేసీఆర్ పాలనలో ప్రజలు విసిగిపోయారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందన్నారు. తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ కుటుంబ పాలనకు తెలంగాణ ఆర్థిక వ్యవస్థ చితికిపోయిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమం పథకాలతో ప్రజలకు మేలు చేస్తుందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా మోడీ 3 కోట్ల ఇండ్లు నిర్మిస్తే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం డబుల్ బెడ్ రూమ్‌లు ప్రజలకు ఇవ్వలేదని ఏద్దేవా చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఘనత మోడీకే దక్కిందన్నారు. అంతకుముందు బీజేపీ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకట్ స్వామి మాట్లాడుతూ కాళేశ్వరం, మిషన్ భగీరథ, డబుల్ బెడ్ రూమ్, ఇతర పథకాలలో కమీషన్‌ల కోసం కేసీఆర్ పని చేశారన్నారు. అంతకుముందు జిల్లా అధ్యక్షుడు వేరబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, గూడెం లిఫ్ట్ విషయాల్లో బీజేపీ మాత్రమే ప్రజల పక్షాన నిలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రజా సమస్యలను పట్టించుకోలేదని అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒకటేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, సీనియర్ నాయకులు గంగి రెడ్డి మల్లారెడ్డి, శ్రీనివాస్, రజనీష్ జైన్, తుల ఆంజనేయులు, పాయల్ శంకర్, కొయ్యల ఏమాజీ, మున్నా రాజా సిసోడియా, తోట మల్లికార్జున్, పట్టణధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్, మండలధ్యక్షుడు కిషన్, నాయకులు వాసు, రమేష్ జైన్, నరేష్ జైన్, లక్ష్మణ్, శ్రీకాంత్, సుధాకర్ పాల్గొన్నారు.

